(1) 11. 06. 2020



సంఖ్య: IV/520 రాగం : మాళవిగౌళ
కీర్తన : రాముడు లోకాభిరాముడుదయించుగాను

## మాళవిగౌళ

**73** రాముఁడు లోకాభిరాముఁ డుదయించఁగాను
భూమిలో వాల్మీకికి పుణ్యమెల్లా దక్కెను ||పల్లవి||

తటుకన మారీచుతలపైఁ బోయఁ గర్మము
కుటిలశూర్పనఖ ముక్కునఁ బండెను
పటుకునఁ దెగె దైత్యభామల మెడతాళ్ళు
మటమాయదైత్యులకు మరి నూరూ నిండెను ||రాము||

తరగె రావణు పూర్వతపములయాయుష్యము
ఖరదూషణాదులకు కాలము దీరె
గరిమ లంకకు నవగ్రహములు భేదించె
సిరుల నింద్రజిత్తాకు చినిఁగె నంతటను ||రాము||

పోరిఁ గుంభకర్ణునికి పుట్టినదినము వచ్చె
మరలి గండము దాఁకె మండోదరికి
పరగె (గ?) నయోధ్యకు భాగ్యములు ఫలియించె
చిరమై శ్రీవేంకటేశుచేఁతలెల్లా దక్కెను ||రాము|| 520

**ఉపోద్ఘాతము:**

అద్భుతమైన ఈ రామగాథ కీర్తనలో కొరుకుడు పడని పద ప్రయోగాలు పుష్కలంగా వున్నాయి. కొన్ని నా భావనకు తట్టినట్లు వివరిస్తున్నాను. అన్నమయ్య భావము ఇది అని చెప్పటానికి వీలులేదు. ఉదాహరణకు "పోరిగుంభ కర్ణునికి పుట్టిన దినము వచ్చె మరలి" అంటే యేమిటి? బాగా ఆలోచించినమీదట నాకు ఇలా తట్టింది. కుంభకర్ణుడు తన పుట్టినరోజునాడు నిద్రలేచి బాగా తిని ఆరు నెలలు మెలకువతో వుంటాడు. ఆపైన ఆరు నెలలు నిద్రపోయి తిరిగి తన పుట్టినరోజునాడు నిద్రలేస్తాడు. అయితే యుద్ధంలో వరుసగా యోధులందరూ చచ్చిపోతే వాడిని బలవంతాన నిద్రలేపారు. వాడు



Scanned with CamScanner

తన పుట్టిన రోజు వచ్చిందనుకొని నిద్రలేచాడు. కానీ అదే వాడు చచ్చినరోజయింది, అవునా? ఈ లోకాభిరాముడు పుట్టుటవలన కదా! వాల్మీకికి అంతులేని పుణ్యం దక్కింది అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

రాముడు (శ్రీరామచంద్రమూర్తి) లోకాభిరాముడు (లోకమున అందరికంటె మనోజ్ఞమూర్తి). భూలోకంలో ఈయన ఉదయించగాను (మానవజన్మనెత్తగానే) వాల్మీకికి (వాల్మీకి మహర్షికి) జన్మజన్మల పుణ్యం అంతా దక్కినది.

ఈ రఘురాముని మూలంగా మారీచుని తలపై రాక్షసుని వలె జన్మించవలసిన కర్మము పోయన్ (నశించినది). వానికి వైకుంఠప్రాప్తి కలిగినది. కుత్సితురాలైన శూర్పనఖకు ముక్కున రక్తముతో పండిపోయెను. రాక్షసుల భార్యల మెడలలోని మాంగల్యములన్నియు పుటుక్కుమని తెగినవి. మరి ఆపైన మటమాయ (గొప్ప మాయావులైన) దైత్యులకు నూరేండ్లు నిండినవి (మృత్యువు వచ్చేసింది).

రావణాసురుడు కొన్నివేల యేండ్లు చేసిన తపముల ఆయుర్దాయము నశించినది. దానితో వాడూ చచ్చాడు. ఖరదూషణాది రాక్షసులు పదివేలమందీ కాలము తీరి ఒకే క్షణంలో నశించారు. లంకా నగరానికి నవగ్రహముల మహిమ తాకి ఛిన్నాభిన్నమయింది. సిరి సంపదలలో వోలలాడే ఇంద్రజిత్తునకు, చినిగె నంతటను (అంతట వాడి బ్రతుకంటా చినిగిపోయి చిందరవందరయినది).

కుంభకర్ణునికి, పొరి (నాశనము తప్పదన్నట్లు) వాడి పుట్టినరోజు అతివేగముగా మరలివచ్చినది (ఉపోద్ఘాతమును జాగ్రత్తగా చదవండి...) మండోదరి మాంగల్యమునకు గండము సంప్రాప్తించి వైధవ్యము తప్పలేదు. అయోధ్యానగరమునకు భాగ్యములు ఫలించినవి. శ్రీవేంకటేశ్వరుని చేతలెల్లా (లీలలన్నీ) చిరమై (బహుకాలముదాకా) దక్కెను (ప్రకటింపబడినవి).

**పద్యవివరణ:**

**తే.గీ.॥ రాముడుదయించలోకాభిరాముడగుచు**
**పుడమి వాల్మీకికినీదక్కె పుణ్యమెల్ల**
**పాడెరామాయణంబిట్లు భక్తితోడ**
**అన్నమయ్య వేంకటనాథు సన్నుతించి.**



Scanned with CamScanner

② 11. 06. 2020



**1-54**

## మున్నుడి

దృశ్యమానంగా అంటే కనులకు కట్టినట్లు ఒక సంఘటన వివరించడం అందరివల్లా అయ్యేపనికాదు. దానికి అద్భుతమైన భావనాపటిమవుండాలి. ఇక దాన్ని కీర్తనలా ఆలపించాలంటే దైవాంశ సంభూతులే చేయగలరా పనిని. హనుమ జానకీమాతను తన భుజములపై జలధిని దాటించి రామచంద్రుని వద్దకు చేరుస్తానన్నప్పుడు"నాయనా! ఇంత చిన్న వానరమైన నీవల్ల ఏమవుతుంది నాస్వామికి నావిషయం వివరించు, చాలు అన్నదట ఆ దేవి. ఇట్లా కాదని గగనమంతా ఆక్రమించిన తన విశ్వరూపం చూపాడట స్వామి. అన్నమయ్య ఆ హనుమను వేంకటనాధుని భక్తునిగా నుతించాడు.

**మ॥ వినరో మోహనరాగమందు యిదివో వేంకన్న సద్భక్తుడున్**
**తన భావంబున అన్నమయ్య కొలిచెన్ ధన్యున్ సుసంపన్నునిన్**
**పెనుఆకారము దాల్చు వాయుసుతునిన్ భీమానుజుండౌకపిన్**
**ఘనునీ కీర్తన పాడి నాడు భళిరా! గంధర్వగానంబిదే**

**రాగం : మోహన**

పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు
పరగి నానా విద్యల బలవంతుడు ॥పెరిగినాడు॥

రక్కసుల పాలికి రణరంగ శూరుడు
వెక్కసపు ఏకాంగ వీరుడు
దిక్కులకు సంజీవి తెచ్చిన ధీరుడు
అక్కజమైనట్టి ఆకారుడు ॥పెరిగినాడు॥

లవి మీరినయట్టి లావుల భీముడు
బలు కపికుల సార్వభౌముడు
నెలకొన్న లంకా నిర్ధూమ ధాముడు
తలపున శ్రీరాము నాత్మారాముడు ॥పెరిగినాడు॥



Scanned with CamScanner

దేవకార్యముల దిక్కువరేణ్యుడు
భావింపగల తపః ఫల పుణ్యుడు
శ్రీవేంకటేశ్వర సేవాగ్రగణ్యుడు
సావధానుడు సర్వశరణ్యుడు ॥పెరిగినాడు॥

## భావామృతం

ఓ ప్రజలారా! ఈ హనుమంతుడు ఎంత పెద్దగా పెరిగియున్నాడో గమనించండి. అనేక విధములైన విద్యలందు నిష్ణాతుడైన ఈ వాయుపుత్రుడు గొప్ప బలము కలిగినవాడు.

ఈ కపిశ్రేష్ఠుడు రాక్షసులకు యుద్ధములోనసాధ్యుడు. ఈయన దుస్సహమైన అసహాయ శూరుడు. దిగంతములకు పోయి సంజీవిని గొనితెచ్చిన ధీరోదాత్తుడు. ఆశ్చర్యము గొలుపు ఆకారమును ధరించినవాడు, ఈ ఆంజనేయుడు. (అష్ట సిద్ధులు ఉన్నవాడగుటచే చిన్న పిల్లిని బోలిన కోతివలె లంకలో సీతను వెదకెను. మున్నుడిలో వివరించినట్లు జానకీ దేవి తననెలా సాగరము దాటింతు వన్నప్పుడు ఆమె తన మాటలను నమ్ముటలేదని విశ్వరూపమును చూపించిన బుద్ధిమంతుడు)

ఈ మారుతి బాగుగా అతిశయించిన ధైర్యముగల పరాక్రమవంతుడు. బలిష్ఠులైన కపికులంబునకే ఈతడు సార్వభౌముడు. తాకరానిదిగా ప్రసిద్ధి గాంచిన లంకానగరమును దగ్ధము చేసిన శౌర్యవంతుడు. శ్రీరామచంద్రుని తన ఆత్మారామునిగా ప్రతిష్ఠించుకొనినవాడు. శ్రీరామ లక్ష్మణులను మూర్ఛనుండి తేర్చుట వంటి పనులు చేసి దేవతలకు దిక్కుగా నిల్చిన ముఖ్యుడు. ఎంచగలిగిన తపః ఫలము గల పుణ్యాత్ముడు. ఈ హనుమంతుడు, శ్రీవేంకటేశ్వరుని సేవించు వారందరిలో అగ్రగణ్యుడు. ఎప్పుడూ సావధానుడై సిద్ధముగానున్న ఈ వాయునందనుడు అందరికీ శరణము నొసంగు మహానుభావుడు.



Scanned with CamScanner